తెలుగులో నాటక విమర్శ

మొదలి నాగభూషణ శర్మ

నాటకాన్ని సర్వకళా సమ్మేళనం అనీ, సమాహారకళ అనీ అంటారు. అన్ని లలిత కళలూ, ప్రదర్శక కళలూ నాటకంలో అంతర్లీనమై వుంటాయని దాని భావం. ఈ కళలన్నింటినీ అందమైన ముత్యాలపేరులా కలిపివుంచడానికి పాఠం (సాహిత్యం) అనే జలతారు దారం ఉంటుంది. ఇన్ని కళల అర్థవంతమైన మేళవింపు జరిగితేనే గాని రాసినివాడికి, వేసినవాడికి ఆనందానిచ్చే ప్రక్రియ కాలేదు నాటకం. మిగిలిన ఏ మాధ్యమానికీ లేని రెండు ప్రత్యేకతలున్నాయి నాటకానికి. ఒకటి, ఇది నిరంతరవర్తమానం: కథ ఎప్పటిదయినా, ఎక్కడ జరిగినా – ఇప్పుడు ఇక్కడ జరుగుతున్నట్లుగా ప్రదర్శించడం. రెండోది, ఇది ప్రాణవంతమైన మాధ్యమం (.....) కావడం. మనలాంటి వ్యక్తులు – సాక్షాత్తు మనముందుకు వచ్చి ఒక కథను దృశ్యమానం చెయ్యడం. ఈ ప్రత్యక్ష అనుభవం నాటకానికి ఒక విశిష్టతను ఆపాదించింది. ఈ కారణాలవల్ల నాటకాన్ని వివేచించడం, విమర్శించడం సంక్లిష్టమైన శాస్త్ర చర్చ అయింది.

కేవలం కావ్యానికున్న విమర్శన పనిముట్లు నాటకానికి చాలవు; ఇది కేవలం, పఠన సాహిత్యానికే కాదు కనక. కేవలం దృశ్య కళలకు ఉండే లక్షణాలను ఆపాదించడానికి వలులేదు, ఇందులో సాహిత్యానికి ప్రాముఖ్యం ఉంది కనుక. నాటకానికి కేవలం పఠనమే పరమావధికాదు. ప్రయోగం కూడా అంతే ముఖ్యం. అభినయ వ్యాపారం ద్వారా నటుడు చేసే దృశ్య వ్యాఖ్యానం – రచనలోని పాఠ్యానికి (.....) భాష్యం చెబుతూ ఓ ఆంతరికి పాఠ్యాన్ని (....)ను బహిర్గతం చేస్తుంది. ప్రేక్షకుడు ఏకకాలంలో ఈ పాఠ్యాన్ని, ఆంతరిక పాఠ్యాన్ని కూడా వింటూ, చూస్తూ ఆయాపాత్రల ద్వారా ప్రవర్ధమానమవుతున్న దృశ్యగాథను తనదైన పద్ధతిలో అర్థం చేసుకుంటాడు. అందువల్ల నాటకంవల్ల కలిగే పరిపూర్ణ అనుభవం దృశ్య–శ్రవ్య లక్షణాలను రెంటిలోను పర్యవసించి వుంది. ఈ కారణం వల్లనే నాటక విమర్శ – అటు సాహిత్య విమర్శతోను ఇటు దృశ్యకళావిమర్శతోను మేళవించబడి వుంటుంది.

మరో రకంగా చూస్తే నాటకం అనేకమంది కళాకారుల ఉమ్మడి ప్రయత్న ఫలితం. దృశ్యం – శ్రవ్యం; రచన– ప్రయోగం; నటుడు–దర్శకుడు; రచయిత–నటుడు–ప్రేక్షకుడు: వీరి పరస్పర సంబంధాలను నిర్వచించుకుంటేే తప్ప నాటక వీక్షణానుభవం పరిపూర్ణం కాదు. అజరామరమైన సాహిత్యాన్ని – తమదికాని అస్తిత్వాన్ని తమమీద ఆరోపించుకున్న నటులద్వారా దృశ్యమానం చేస్తూ – తత్కాల ఉద్వేగపరంపరలద్వారా అలౌకికమైన ఆనందాన్ని యిచ్చేవాడు నాటకకర్త.

“దృశ్యకావ్యకర్తను బాధించే ప్రతిబంధకాలు చాలా యెక్కువ. బాధ్యతకూడా యెక్కువే. సన్నివేశ సమన్వయమూ, దేశకాల పాత్ర విచక్షణా, రంగేచితీ, మానవమనస్తత్వ పరిశీలనా, రసపోషణా, భాషాస్వారస్యమూ, కథకాల సంఘజీవన ప్రతిబింబమూ – యివి అతన్ని ముఖ్యంగా బాధించే నాటకాంశాలు. నిత్య జీవితంలో అడుగడుగునా మానవుణ్ణి యెదిరించే వివిధ పరిణామాలను కండ్లకు కట్టేలా చూపించి, పాఠకుడికి, ప్రేక్షకుడికి

ఏదో ఒక అమూల్య సత్యాన్ని బోధింపవలసిన అతిలోక విజ్ఞాని నాటక రచయిత. చరిత్రలోని సత్యాసత్యాలను నిర్ణయించవలసిన న్యాయమూర్తి.”

మనం చేసే నాటకవిమర్శ నాటకకర్త / దర్శకుడు నిర్వర్తించవలసిన యీ పనులలో దేనికైనా కేంద్రీభూతం చేసుకోవచ్చు; అంటే నాటకకర్త వ్రాసిన పాఠాన్ని కేంద్రబిందువుగా చేసుకుని విమర్శచేయవచ్చు (……); పాత్రల నిర్వహణను బట్టి వారి మానసిక వ్యాపారాన్ని బట్టి విమర్శ చేయవచ్చు (……); పాత్రల, కథల సామాజిక పరిస్థితుల విశ్లేషణ చేస్తే ఆ పరిస్థితులు కథమీద ఆపాదించే నిర్ణయాల దృష్ట్యా విమర్శించవచ్చు (……); శిల్పాన్ని బట్టి వుండవచ్చు మన విమర్శ (……); భాష దృష్ట్యా చేయవచ్చు (……); నాటకం మన మీద కలిగించే ఉద్వేగ ప్రభావాన్ని దృష్టిలో వుంచుకుని విశ్లేషించవచ్చు. (……). ఇంతటి వైవిధ్యాన్ని దృష్టిలో వుంచుకుని తెలుగు నాటకవిమర్శ చరిత్రనూ, స్వరూప స్వభావాలను రేఖామాత్రంగా పరిశీలించవలసి వుంది.

ప్రాచీన కాలంలో తెలుగు మార్గనాటకాలు లేకపోవడం వల్ల సంస్కృత నాటకాలకు వలె తెలుగు నాటకాలకు వ్యాఖ్యలు వచ్చే అవకాశం లేకపోయింది. ప్రదర్శనే పరమావధి అయిన జానపద నాటకాలకు విమర్శలు అన్నీ మౌఖికంగా తత్కాలానుసరళంగా జరిగేవి. సంస్కృతంలోని కావ్యశాస్త్రాలను తెలిగించిన వారెవ్వరూ (ఒక్క చిత్రకవిపెద్దన (1550) తప్ప) నాటక లక్షణాలను అనువదించక వదిలివేశారు. నాట్యదర్పణంలోని నాటక సంక్షిప్త లక్షణాలను (సూత్రాలను) 1903లో శృంగారకవి సర్వారాయుడు ‘నాటక లక్షణములు’ అనే పేరుతో అనువదించేదాకా మనకు నాటక శాస్త్ర విషయాల ధ్యాసే లేకపోయింది. అందువల్ల మార్గనాటక రచన ప్రారంభంతోనే ఆధునికి తెలుగు నాటక విమర్శకూడా ప్రారంభమైనదని చెప్పవచ్చు.

ఆధునికి తెలుగు నాటక విమర్శ 1875వ సంవత్సరం సెప్టెంబరు 21న ప్రారంభమైనదని చెప్పవచ్చు. జూలియస్ సీజర్ నాటకాన్ని ‘సీజరు చరిత్రము’ అనే పేరుతో ఆసాంతమూ తేటగీతులతో రచించి వావిలాల వాసుదేవశాస్త్రి దానికొక పీఠికను వెలయించినారు. తెలుగు పీఠిక తేదీ 1875 సెప్టెంబరు 21. ఆంగ్లపీఠిక తేదీ 1876వ సంవత్సరం జనవరి 4వ తేది. ఈ పీఠికలో తాను ఈ నాటకం వ్రాసిన పద్ధతులను విశ్లేషించి తెలుగులో నాటక విమర్శకు శ్రీకారం చుట్టాడు వావిలాల.

………………………………………………

శాస్త్రిగారు కేవలం షేక్స్పియర్ నాటకాలను చూసే ఈ నియమాన్ని చెప్పివుంటారు. సాధారణంగా కావ్యరచనలో విభిన్నమైన ఛందస్సులు వాడే ఒక పద్ధతి అనూచానంగా వస్తున్నా, తాను ఒకే ఛందస్సులో గ్రంథాన్ని వ్రాయడం ఒక కొత్త పోకడ (……….) అంటారాయన.

ఆదిని లాతి తెలుంగబొత్తబువలె దీని నానావిధవృత్తంబులతో బ్రబంధాకృతిని రచియింపదలంపు గలిగె…. కాని, యిప్పటివారికి నాటకరీతియందే యభిరుచియెక్కువయని కొందరు నా స్నేహితులు సలహాయిచ్చిన

కతన దొంటియభిప్రాయంబు మాయించి నాటక వైఖరిని మొదటినుండి తుదివరకుం దేటగీతినే వ్రాయుట తగునని యెంచి యీతీరున వ్రాసినాడ.

ఈ పీఠికలో తన రచనా విధానాన్ని గురించి, అనువాదంలో అనుసరించిన పద్ధతులను గురించి చర్చించడం ద్వారా నాటకవిమర్శకు ఆద్యులయినారు వావిలాల వాసుదేవశాస్త్రి. తరువాత 40 సంవత్సరముల పాటు నాటక రచయితలు చాలామంది తన రచనలను గురించిన ఈ రెండు విషయాలను చర్చిస్తూ పీఠికలు వ్రాశారు. నాటక రచయితలను గురించి విమర్శకులు అంచనా వేయడానికి కావలసిన ముడిసరుకు కూడా ఇదే......

తమ తమ నాటకాలకు రచయితలు వెలయించిన పీఠికలను ఆత్మాశ్రయ విమర్శగా స్వీకరించవచ్చు. ఈ నాణానికి అవతలివైపున ఆ నాటకాల మీద పత్రికలలో వచ్చిన విమర్శ ఉంది. ఇది సాధ్యమైనంతవరకు నిష్పక్షపాతంగా (.......) ఉన్నదనే చెప్పవచ్చు. 'సీజరు చరిత్రము'ను తమ పత్రికలో సమీక్షిస్తూ 1876లో వివేకవర్ధిని పత్రిక చేసిన విమర్శలు యీ రకం గ్రంథ విమర్శనలలో మొట్టమొదటిది. వివేకవర్ధిని రెండో సంపుటం, ఐదో సంచికలో –

1. ఇంగ్లీషు నాటకములను దెనిగించు వారిలో వీరే మొదటివారు.
2. శైలి సులభమైనది; ఇంపైనది.
3. కేవలము వ్యాకరణ యుక్తముగానే వ్రాయబడక యచ్చటచ్చట వాడికలోనున్న యందమైన గ్రామ్య పదములను నవ్యభాషాపదములను గూడా ప్రయోగింపబడి యున్నవి. అట్టి వుండుట మన పండితులకు గొందఱకు రుచింపకపోయినను, సాధారణముగా నిప్పటి వారికందఱకు నాహ్లాదకరములుగానే యుండునని తలంచెదము.
4. ఇంగ్లీషు పేర్లనే యీ గ్రంథమునందు వాడబడుటచే భాషాజ్ఞానములేని యాంధ్రులకట్టివి శ్రుతి కటువులుగా దోచవచ్చును. కాని భాషాంతరీకరణమగుటచే నట్టివనివార్యములు.

ఇంకా ఇటువంటి ఆంధ్రీకృత గ్రంథాలను వావిలాల వెలయించాలని చెబుతూ –

5. ఈ సారి వ్రాయునపుడైన బుస్తకముకడవరకు నొకే పద్యమువలె వ్రాయక నాటకమున కనుకూలముగా వేఱువేఱు పద్యములనుపయోగింతురని గ్రంథకర్తగారిని కోరుచున్నాము.

పేరుపెట్టలేదుగాని ఇది కందుకూరి వారి సమీక్షే! ఈ గ్రంథ విమర్శనం చదివితే వావిలాల వారి పుస్తకాన్ని గురించి ఎంత చెప్పాలో, రాబోయే తన అనువాద విధానాన్ని అంతగానూ చెప్పారని అనుకోవచ్చు. గ్రామ్య, అన్య భాషా పదాల వాడుక, అనువాదం కాకుండా అనుసరణ; పేర్లను మార్చడం; ఇంగ్లీషులోవలె కాకుండా వేరు వేరు ఛందస్సులను నాటకంలో వాడడం.... ఇత్యాదులన్నీ కందుకూరి అనుసరించిన అనుసరణ విధానంలో రూపుదిద్దుకున్నవే!

సంక్షిప్తంగా నయినా పుస్తక విమర్శ ఏ విధంగా చేయాలో, అందులో ఏఏ విషయాలను గురించి, విమర్శకుడు తనదైన అవగాహనతో, చర్చించాలో – సోదాహరణముగాను, సుధీర్ఘంగాను కాకపోయినా, నిరూపించిన సమీక్ష ఇది. ప్రధమ దశలో వచ్చిన రెండు విమర్శనా పద్ధతులకు వావిలాల, కందుకూరి, నాంది, ప్రస్తావనలు పలికారని చెప్పవచ్చు.

ఈ మొదటి తరం రచయితలందరూ తమ పీఠికలద్వారా తమ సృజనాత్మక రచనలకు పురికొల్పిన పరిస్థితులను, తమను ప్రభావం చేసిన కారణాలను, తాము నాటకరచనలో / అనువాదంలో / అనుసరణలో అనుసరించిన విధానాన్ని తమ పీఠికల ద్వారా వెలువరించారు. వావిలాలన వాసుదేవశాస్త్రి గారు "ఉత్తర రామ చరిత్ర"కు వ్రాసిన ఆంగ్ల, ఆంధ్ర పీఠికలలో కోరాడ, కొక్కొండ ప్రభృతులు నాటక ప్రయత్నాలను గురించి వివరంగా చెప్పారు. అలాగే ధర్మవరం రామకృష్ణమాచార్యులుగారు తమ చిత్ర నళీయ, విషాద సారంగధర నాటకాలను వ్రాసిన సుధీర్ఘమైన పీఠికలు వారి సృజనాత్మక విధానాలకు అద్దం పట్టడమే కాకుండా, ఆనాడు తెలుగు నాటకాలంటే బళ్లారి ప్రజలకున్న చిన్నచూపును, దానిని అధిగమించి స్వంతంత్ర నాటక నిర్మాణానికి పూనుకుని, తాను రచయితగా, నటుడుగా, దర్శకుడుగా రూపుదిద్దుకున్న పరిస్థితులకు నివాళిపడతాయి. విషాద సారంగధర పీఠికలో విషాద నాటకాన్ని గురించి ఆయన చేసిన సిద్ధాంతాలు ప్రసంసనీయాలు.

ఇక గురజాడ అప్పారావు గారు 1892లో వ్రాసి ప్రదర్శించిన కన్యాశుల్కం మొదటి ప్రతి ముద్రణకు, దానిని పెంచి 1909లో ప్రకటించిన రెండవ ముద్రణకు విపులమైన పీఠికలు వ్రాశారు. వస్తునిర్మాణ, భాష్నాప్రయోగాల విషయంలో ఈ పీఠికలు ఆంధ్రనాటక విమర్శ చరిత్రలో మైలురాళ్ళేనని చెప్పవచ్చు.

తమ పీఠికల ద్వారా నాటక విమర్శకు దోహదం చేసినవారిలో ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ (మనోరమ, 1895), కోలాచలం శ్రీనివాసరావు, నాదెళ్ళ పురుషోత్తమ కవి గార్లను పేర్కొనవచ్చును. శర్మగారి పీఠికలో కేవలం తన నాటకాన్ని గురించి మాత్రమే వ్రాసుకున్నారు. కోలాచలం తన అన్ని నాటకాలకు సంక్షిప్త పీఠికలు వ్రాసి, అందులో ప్రతి నాటకానికి ఉన్న మూలాలను సవివరంగా తెలిలయచెప్పారు. నాదెళ్ళవారు హిందుస్థానీలో 30 నాటకాలను వ్రాశారు. అవి అన్నీ బందరులోని నేషనల్ థియాట్రికల్ కంపెనీవారు ప్రదర్శించేవారు. హిందుస్థానీలో వ్రాసిన రామదాసు నాటకానికి, తెలుగులో ప్రకటించిన హరిశ్చంద్ర నాటకానికి ఆయన సుధీర్ఘమైన పీఠికలు వ్రాశారు. అందులో అమూల్యమైన చారిత్రక విషయాలను వ్రాశారు. ధార్వడవారు బందరు రావడం, అక్కడ హిందుస్థానీ నాటకసమాజాన్ని స్థాపించి తన దగ్గరకు వచ్చి రచనల కోసం కోరడం, రెండు సంవత్సరాలలో తాను 30 నాటకాలను వ్రాసి యివ్వడం, అందులో ప్రధాన పాత్రలను నిర్వహించిన వివరాలు – అన్నీ తెలియచెప్పారాయన. అలాగే చిలకమర్తి 'పారిజాతాపహరణానికి వ్రాసిన పీఠికలో రాజమండ్రి హిందూ నాటక సమాజం చేసిన నాటక సేవను గురించి, బలిజేపల్లి లక్ష్మీకాంతం హరిశ్చంద్ర నాటక పీఠికలో గుంటూరు హిందూ నాటకసమాజ ప్రత్యేకతను గురించీ వివరించి ఆ నాటక సమాజాలను గురించి పాఠకులకు తెలియచేసే ప్రయత్నం చేశారు.

నాటక విమర్శను ప్రోత్సహించిన పత్రికలలో ముఖ్యమైనవి పూండ్ల రామకృష్ణయ్యగారి ఆముద్రిత గ్రంథ చింతామణి (1887), న్యాపతి సుబ్బారావుగారి చింతామణి (1891), పనప్పాకం అనంతాచార్యులుగారి వైజయంతి (1894). ఆముద్రిత గ్రంథ చింతామణిలో పత్రికాధిపతులే నాటక విమర్శలు చేసేవారు. వారు కన్యాశుల్కం మీద చేసిన విమర్శనాత్మక సమీక్ష అందులో ప్రయుక్తం అయిన ఆంగ్ల-పదజాలం గురించి. చింతామణిలో పత్రికకు సంపాదకుడు అనంతాచార్యులుగారే అయినా, నిర్వహణ మాత్రం ఆయన కుమారుడు పనప్పాకం శ్రీనివాసాచార్యులు గారిదే. ఆయన పి.యస్.చార్యులు పేరుతో చిత్రనళీయ, సుఖమంజరీ పరిణయాది నాటకాలకెన్నింటికో సునిశితమైన విమర్శలను వ్రాశారు. సమీక్షకుని విమర్శల వ్యాఖ్యానాలతో కథను చెప్పుకుంటూ పోవడం శ్రీనివాసాచార్యులుగారి కృతివిమర్శన పద్ధతి.

వైజయంతి పత్రిక రెండు మూడు సంపుటాలలో చిత్రనళీయ నాటకాన్ని సమీక్షిస్తూ మొట్టమొదటిసారి నాటక గమ్యం ప్రదర్శన అనీ, దానికి తగిన లక్షణాలను ప్రతిఒక్కరూ జ్ఞాపకం ఉంచుకోవాలని చెప్పి నాటక రంగ లక్షణ లక్ష్యాలను చిత్రనళీయం ఆధారంగా నిరూపించారు. తెలుగులో నాటకాలు లేవని విచారించిన కొందరు రచయితలు ముందుగా గీర్వాణ భాషలోని నాటకాలను తెనిగించడం ప్రారంభించారని, మరికొందరు –

"అట్టి రూపకముల భాషాంతరీకరణంబున దమతొలుతటి యందము బాయునని తలపోసి యొక్కకొందఱు నూతనంబులగు నాటకంబుల గూర్పదివిరిరి."

.........

నాటకమునకు మొదటి లక్షణము చూపరులయు, చదువరులయు మనసునాకర్షింపజాలుట. అనగా నాటక ప్రయోగంబున బాత్రములే చదువంబడిన పల్కులను, న్నాటక పఠనంబున చదువరులచే జదువంబడిన విషయంబులు నా చూపరుల యొక్కయు జదువరుల యొక్కయు హృదయంబులకు సందర్భోచితంబులుగ మోదఖేదంబుల గీలు కొలుప వలయు..... పాత్రలములకు దగిన భాషయు, సమయోచితములగు వక్తృత్వమును, లోకవ్యవహారజ్ఞానంబును, మానుషమనోవృత్తి పరిజ్ఞానంబును, స్వాభావికవర్ణనంబులను నాటక రచనంబు లయందు నుపయోగపఱుపమించేసి యిట్టి సందర్భంబులు పుట్టునవి........

మారుతున్న నాటక విమర్శనా దృష్టిని ఈ వైజయంతి సమీక్ష ప్రతిబింబిస్తున్నదని చెప్పవచ్చు.

నాటక సమీక్షలతోనే కొన్ని పత్రికలు సంతుష్టి చెందితే మరికొన్న పత్రికలు నాటకాలు సమాజానికి ముఖ్యమైనవని, అవి నైతికంగా బావుండాలని, అవి నీతిని బోధించాలంటే నాటక సమాజాలు నీతి మంతములై వుండాలని నిర్దేశించాయి. ఆనాటి పత్రికలలో నాటకాలను గురించి వచ్చిన మొట్టమొదటి వ్యాసం 1889 మార్చి, ఏప్రిల్ నెలల్లో "హిందూజన సంస్కారిణి"లో వచ్చిందని చెప్పవచ్చు. "హిందూసంఘ స్థితి"ని సమీక్షిస్తూ, స్త్రీ విద్యను గురించి, క్రింది తరగతి వారి విద్యను గురించి సమవలోకనం జరుపుతూ, విద్య నేర్పని తరగతులకు

నాటకం విద్యగరపే సాధనంగా ఉపయోగించడం మంచిదేకాని, ఆనాటి నాటక సమాజాల స్థితి ఈ నైతిక బాధ్యతలను స్వీకరించే విధంగా లేదని పేర్కొన్నది: దీనికి కారణం పాత ఫక్కీ నాటకాలలో పాల్గొనే వెలయాండ్రది, వారిని చేర్చిన విటనటకులది – అంటూ అందువలననే "యిప్పుడు బయలుదేరుతున్న నాటకములలో జేరు విద్యార్థికులు గూడ చెడుదురను భయము తలిదండ్రులకు బట్టుచున్నది" అంటాడు వ్యాసరచయిత. అటువంటి వారు ప్రస్తుత కాలుప నటులలో కూడా ఉన్నారని, అట్టి దుర్మార్గులగు.... పురుషులను సహితము తమ సమాజములలోనుండి తప్పించవలెను". ఈ నైతిక బాధ్యత నాటక సమాజములదేనని నిక్కచ్చిగా చెప్పాడు హిందూజన సంస్కారిణి వ్యాసకర్త.

1875–1900 మధ్యకాలంలో పైన పేర్కొన్న పీఠికలు, సమీక్షలు, నాటకరంగ వర్తమాన స్థితిగతులు – ఇవికాక నాటకాల మీద వచ్చిన విమర్శఅంతా గ్రాంథిక గ్రామ్య భాషావివాదం మీద, అనువాదాల మంచిచెడ్డల మీదనే కేంద్రీకృతం అయింది. వీరేశలింగం గారి వివేకవర్ధిని, కొక్కొండ వెంకటరత్నం పంతులుగారి ఆంధ్రభాషా సంజీవని వీనికి యుద్ధభూములు. ఈ వాద ప్రతివాదాలలో పాల్గొన్న ప్రముఖుల్లో కందుకూరి, కొక్కొండ, వేదం వెంకటరాయశాస్త్రి, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి ముఖ్యులు. ఈ వివరాలు ఎంత ప్రచండంగా జరిగేవంటే కొక్కొండ వారు 114పేజీల ఆంధ్రీకృత ప్రసన్నరాఘవం వ్రాస్తే, దాని అనువాద అసమర్థతను నిరూపించడానికి వేదం వేంకటరాయశాస్త్రిగారు డెమ్మీ సైజులో, చిన్న ప్రింటులో 338 పేజీల ఉద్గ్రంథాన్నే వెలయించారు. దానిపేరు ఆంధ్ర ప్రసన్న రాఘవ విమర్శనము (1898). ఈ గ్రంథాన్ని ముగిస్తూ వేదంవారు అన్న మాటలు –

ఇట్టి యీ లఘు విమర్శచేత ఆంధ్ర విద్యార్థులును, బాహ్యాంధ్ర కవులును ఇట్టి యాంధ్రీకరణముల వలనను ఇట్టి కవనములవలనను గలిగిన చెఱుపును చక్కగ నెఱింగి, ఆంధ్రభారతి యొక్క స్వభావమును, మధురిమను, ఉదాత్తతను కాపాడి, యుత్కృష్టగ్రంథములు చేయలేక మానిన మానుదురుగాక, ఈ యాంధ్రీకరణము వంటివి మాత్రము చేయకయుందురుగాకయని కోరుచున్నాడను.

1900 నాటికి నాటక సమాజాలు ఊరూరా వెలిశాయి. 1910 నాటికి అందులో చాలా నాటక ప్రదర్శనలను మానుకున్నాయి. నాటక సంస్థలు స్థిరంగా పనిచేయడానికి కావలసిన ప్రాథమిక సూత్రాలను నిర్వచించడానికి కొందరు నాటక మిత్రులు ప్రయత్నించారు. కొండిపర్తి సూర్యనారాయణరావు గారి ఆంధ్రనాటక సంఘ మార్గప్రదర్శిని (1910) ఇట్టి రచనలో మొదటిది.

ఇదే సమయంలో అంతవరకు వచ్చిన తెలుగు నాటకాల వైఖరిని, ఏయే రకాల నాటకాలు ఎన్ని వస్తున్నాయి, దానికి కారణాలేమిటో వివేచన చేసే ................ను తల్లాప్రగడ సూర్యనారాయణరావు, పురాణం సూరిశాస్త్రి ప్రారంభించారు. తల్లాప్రగడ ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రికలోను (1913), సూరిశాస్త్రి గ్రంథాలయ సర్వస్వము (1913) లోను 'ఆంధ్ర నాటకములు' అన్న శీర్షికతో వ్యాసాలు వ్రాస్తూ పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాల జాబితాలను ఇచ్చి, వెనుకటి వీధినాటకాల కన్న ఆధునిక నాటకాల ఎక్కువగా వస్తున్నాయని,

అందులో పౌరాణికాల సంఖ్య అధికంగా ఉన్నదనీ తేల్చారు.

1900-1920 మధ్యకాలంలో కూడా చాలా పత్రికలు నాటకవిమర్శలు, సమీక్షా వ్యాసాలు ప్రచురించసాగాయి. అందులో చిలకమర్తిగారి మనోరమ, శ్రీపాదకృష్ణమూర్తి శాస్త్రి, నాళం కృష్ణారావుల మానవసేవ, తల్లాప్రగడ సూర్యనారాయణరావు సువర్ణలేఖ ముఖ్యమైనవి. చిలకమర్తివారు మనోరమలో వడ్డాదా సుబ్బారాయుడుగారి శాకుంతలానువాదాన్ని విమర్శిస్తూ ఇతర అనువాదాల సహాయంతో వసురాయుడు గారి అనువాదం బావుండలేదని సోపపత్తికంగా వివరించారు (1906 డిసెంబరు). బహుశః తెలుగు నాటక విమర్శ చరిత్రలో ఇదే మొదటి తులనాత్మక విమర్శ కావచ్చు.

1910-20 మధ్యకాలంలో భవిష్యత్తుకు మార్గదర్శకాలైన రెండు విమర్శక మార్గాలను ఇక్కడ పేర్కొనాలి. మొదటిది 1912లో తోలేటి వెంకట సుబ్బారావుగారు సమీక్షించిన బళ్లారివారి చిత్రనళీయ, గుంటూరువారి శాకుంతల నాటకాల ప్రదర్శనలు. ఆసాంతమూ నాటక ప్రదర్శనను సమీక్షిస్తూ సాగిన విమర్శలలో ఇవే ప్రథమం. నాటక ప్రదర్శనకు అవసరమైన అన్ని అంగాలను గురించి తోలేటి ఇందులో ప్రస్తావించారు. 1915లో తణికెళ్ల వీరభద్రుడుగారు సారంగధరలోని (ధర్మవరం) చిత్రాంగి పాత్ర చిత్రణమీద ఒక విస్తృత వ్యాసాన్ని ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలో వెలువరించారు. పాత్ర చిత్రణ మీద వచ్చిన అత్యుత్తమ వ్యాసాలలో ఒకటిదిగా దీనిని పరిగణించవచ్చును.

తరువాతి 40 సంవత్సరాలలోను రానురాను విస్తృతమవుతున్న నాటక విమర్శకు ప్రాతిపదికగా 1919వ సంవత్సరంలోనే పురాణం సూరిశాస్త్రిగారి ఆధ్వర్యంలో సంఘం ఏర్పడి "ఆంధ్ర నాటక నామావళి"ని ప్రచురించడం ద్వారా క్రమపద్ధతిలో నాటక చరిత్రలను వ్రాయడానికి వస్తు సంభారాలను కూర్చింది. అదే సంవత్సరం గంజాం జిల్లా పోలకిలో విశ్వనాధ కవిరాజుగారు ఆంధ్ర నాటక సభను ప్రారంభించి, నాటకోత్సవాలను చేస్తూ ప్రముఖ విమర్శకుల చేత ఉపన్యాసాలు యిప్పించడం ప్రారంభించారు.

ఈ విధంగా యీ 40 సంవత్సరాల ఆరంభదశలో నాటకవిమర్శ పీఠికలతో ప్రారంభమై, సమీక్షలతో నిలతొక్కుకుని, విశ్లేషనాలతో ముందడుదు వేసింది. నాటక పాఠాన్ని విమర్శించడంతో ప్రారంభమై నాటకరంగానికి విస్తరించింది. అనువాద విధానాల వాగ్యుద్ధాలతో ప్రారంభమై చరిత్ర నిర్మాణానికి, నాటక విశ్లేషణకు అవసరమైన వస్తుసామాగ్రిని కూర్చుకుంటున్నది.

1923-1943

గత 40 సంవత్సరాలలోను అటు నాటక విశ్లేషణలోను, ఇటు నాటక ప్రదర్శనల సమీక్షలలోను ముఖ్యమైన కృషి జరిగింది. ఎవరో ఒకరిద్దరు తప్పితే మిగిలిన వారందరూ నాటకరచన, ప్రదర్శనలను రెండు విభిన్నమైన మార్గాలను చూశారు. ప్రత్యేక విభాగాలుగా వేరువేరుగా విమర్శించారు. కాని 1923-43 మధ్య

కాలంలో రచన, ప్రదర్శనల సమన్వయం – దానికి పర్యవసానంగా వాటి సమన్వయమే ముఖ్యమన్న నాటక విమర్శకుల అవగాహన రూపుదిద్దుకున్నాయి. ఈ సమన్వయ భావానికి దోహదం చేసిన ప్రధానమైన వ్యక్తి పురాణం సూరిశాస్త్రి. ఈయన నాట్యాంబుజము (1923), నాట్యోత్పలము (1924), నాట్యాశోకము (1927) తెలుగు నాటక విమర్శకు ప్రమాణ గ్రంథాలు.

1923కు ముందే ఆయన ఆంధ్రనాటక సంస్కర్తలను కలవరపెడుతున్న అనేక సమస్యల మీద ప్రముఖుల ఉపన్యాసాలను, అభిప్రాయాలను సేకరించి కృష్ణాపత్రికలో ప్రచురించారు. వీరిలో కోలాచలం, పానుగంటి, శ్రీపాద కామేశ్వరరావు గార్ల వ్యాసాలున్నాయి. 1916లోనే ఆంధ్రనాటక నామావళిని ప్రచురించాడు. ఆ అనుభవంతోను తెలుగునాట, మద్రాసులోను చూచిన నాటకానుభవంతోను, బహుభాషాపాండిత్యంతోను ఆయన సరికొత్త పద్ధతిలో నాట్యవ్యాసంగం ప్రారంభించారు.

'నాట్యాంబుజము'లో 8 అధ్యాయాలున్నాయి. అది నాటకానుభవము, ఆంధ్రనాటకములు, నాటక సమాజములు, ప్రసిద్ధ నటులు, ప్రదర్శన విమర్శనము, ఆంధ్రనాటకవిమర్శనము, నాటక సమస్యలు, నాటక విమర్శనము అన్న ఎనిమిది దళాలుగా విభజింపబడ్డది. ఇంతటి సమగ్రమైన నాటక, నాటకరంగ విశ్లేషణ తరువాత చాలాకాలానికి కాని రాలేదు. నాట్యాశోకానికి పీఠికవ్రాస్తూ నాటకవిమర్శకుడి లక్షణాలనుగురించి స్వానుభవంతో ఆయన చెప్పిన మాటలివి:

తన బుఱ్ఱలో జరిగే నాటకమంతా చూడనేర్చినప్పుడే నాట్యరంగాల మాటలు సార్థకంగా చూడగల్గుతాడు. రసమందరూ ఆస్వాదిస్తారు. జీవితానుభవాలు అందరికీ ఉంటవి. బుద్ధిని మూడుపాయలుగా చీల్చి, వ్యావహారికంలో భోక్తృత్వ కర్తృత్వాలకు ఒకదాన్ని నియమించి, రెండవదానితో జరన్నాటక విలాసశోభలను, నిత్యానంద తూష్ణీ భావమును అనుభవించుచూ, మూడవదాన్ని సాక్షిభావమున ఏకాగ్రధారణలో వర్తింపచేయగలిగినవాడే రసరహస్యమెరిగిన విమర్శకుడగును.

విమర్శక వ్యాపారమంతా లోకజ్ఞానముమీద నిలచియున్నది. లోకానుభవానికి జ్ఞానరూపమొనగూర్చు టకు పైన చెప్పిన సాక్షిభావము, యోగసాధన ఉండవలెను.

నాట్యాంబుజములో తెలుగు నాటక విమర్శ, నాట్యోత్పలములో విదేశ నాటక ప్రదర్శన విమర్శ, నాట్యాశోకములో తెలుగు నాటక సమాజములు, నటుల వివరణ ఉన్నాయి. ఇందులో ప్రదర్శనల మీద పురాణం వారు చేసిన విస్తృత వ్యాఖ్యలు ఈ నాటికీ మాననీయాలే!

ఈ దశకంలోనే నాటకరంగంతో సన్నిహిత సంబంధమున్న మహామహులు చాలామంది నాటక విమర్శకు పూనుకున్నారు. గొల్లపూడి శ్రీరామశాస్త్రిగారి ఆంధ్రనాటక రంగము (1924) ఎక్కువగా చిత్తూరు, నెల్లూరు, బళ్ళారి నాటక సమాజాలను గురించి, అక్కడ వెలువడ్డ నాటకాలను గురించి వివరించింది. టేకుమళ్ళ

అచ్యుతరావుగారి  ఆంధ్ర నాటకములు, నాటకరంగము (1926) అప్పుడప్పుడే వస్తున్న అమెచూర్, వృత్తి నాటకరంగాల వేరువేరు ధ్యేయాలను చర్చించింది. ఇక పసుమర్తి యజ్ఞనారాయణగారి ఆంధ్రనట ప్రకాశిక (1930) ఆంధ్రనటుల, సమాజాల చరిత్ర. ఆంధ్ర నాటకరంగం మీద ఆంధ్ర నటప్రకాశిక వంటి విస్తృతమైన అవగాహన కలిగిన పుస్తకం ఈ నాటివరకూ రాలేదంటే అతిశయోక్తి కాదు. ఈ గ్రంథంలో ఉన్న పది ప్రకరణాలలో సంగీత అభినయ, రచనా, ప్రయోగాలను గురించే కాక రంగస్థలాలను గురించి, పాత్రపోషణ గురించి కూడా సోదాహరణముగా వివరించారు. ముఖ్యంగా వాచిక, అభినయ విధానాలకు సూత్రాలను నిర్ధారించి నటులు తేలికగా గుర్తుపెట్టుకునే సౌకర్యం కలగచేశారు. ఆంధ్రదేశంలో ప్రముఖ వృత్తి నాటక సంస్థలను గురించి మొదట వ్రాసింది శాస్త్రిగారే!

1923లోనే నాటక పరిశోధన, విమర్శన, సమీక్షల కోసం విశ్వనాథ కవిరాజుగారు ఒక మాస పత్రికను ప్రారంభించారు. 'నాటకకళ' బతికి బట్టకట్టిన 14 నెలలలో అత్యుత్తమ నాటక విమర్శనా వ్యాసాలను వెలువరించింది. మొదటి సంచికకు ముందు మాట వ్రాస్తూ –

సారస్వత చరిత్రమున నాటకయుగమారంభమైనది. కొన్నిమంచి నాటకములు వెలువడకపోలేదు. కాని పెక్కులు నాటక నామావర్ణములైనవి. సలక్షణమగు నాటక రంగస్థలములు లేనివాడు నాటక వాఙ్మయము వర్ధిల్లనేరదు. రూపక గ్రంథములకును నాటక సమాజములకును అవినాభావ సంబంధమున్నది. వీనిరెంటిని సంస్కరించి యభివృద్ధి పఱచునుద్దేశ్యములో నీ పత్రిక వెలిబుచ్చుచున్నాము –

అన్నారు విశ్వనాధ కవిరాజు. ఇది ఎక్కువ కాలం సాగకపోవడం నాటక మిత్రుల దురదృష్టం. ఈ కాలంలో వెలువడిన సాహితీ పత్రికలలో కూడా నాటకాలమీద నాటక ప్రదర్శనల మీద వచ్చిన వ్యాసాలు చాలా ఉన్నత స్థాయిలో ఉన్నవని చెప్పవచ్చు. *భారతి*లో వచ్చిన సంస్కృత నాటకాల సమాలోచలనం, ఆధునికి నాటకకర్తల నాటకాల ప్రచురణ, *శారద*లో ఫోటోగ్రాఫులతో సహా వెలువడ్డ నాటక ప్రదర్శన సమీక్షలు, *జయంతి, వీణ* పత్రికలలోని నాటక విశ్లేషణలు, *ఉదయని* లోని నాటక వ్యాసాలు, *కళ*లోని నాటకరంగం వ్యాసాలు ప్రత్యేకంగా పేర్కొనదగినవి. *గ్రంథాలయ సర్వస్వం*లో కూడా నాటకాలమీద నాటక ప్రదర్శనలమీద ఆధికారిక మైన వ్యాసాలు వెలువడ్డాయి.

నటశిక్షణకు తరగతులను ప్రారంభించిన మొట్టమొదటి వ్యక్తి బి.టి. రాఘవాచార్యులు. విద్యార్థుల ఉపయోగంకోసం నటశిక్షణనంతా 7 పాఠాలలో వ్రాసి ప్రచురించారాయన. అందులో అమెచూర్, వృత్తి నటుల్ని గురించి, సమాజంలో రంగనిర్ణేత పాత్రను గురించి, రిహార్సల్ విధానం గురించి వాచిక ఆంగిక అభినయాలను గురించి, సాంకేతిక విషయాలను గురించి అత్యవసరమైన ప్రాథమిక పరిజ్ఞానాన్ని అందించారు ఆచార్యులుగారు.

తమ నాటకాలకు గొప్పవారిచేత పీఠికలు వ్రాయించే పద్ధతి ప్రారంభమైంది యిప్పుడే. అశేషంగా

వచ్చిన అటువంటి పీఠికలలో మేలిబంతులనదగినవి కొద్దిగానే వుంటాయి. యేటుకూరి సీతారామయ్యగారి పౌరాణిక వచన నాటకం 'సీతారామవియోగం'కు (1920) శేషాద్రిరమణ కవులు, చలం 'సావిత్రి'కి (1927) గిడుగు రామమూర్తి పంతులుగారు, బుద్ధవరపు పట్టాభిరామయ్యగారి 'పెద్దపురం ముట్టడి' (1928)కి విస్సా అప్పారావుగారు, ఉన్నవ లక్ష్మీనారాయణగారి నాయకురాలు (....)కి పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రిగారు వెలువరించిన పీఠికలు సాహిత్య గౌరవాన్ని పొందవలసిన ఉత్తమ స్థాయిలో ఉన్నాయి.

ఈ కాలంలో వచ్చిన రెండు విమర్శన గ్రంథాలు రాశిలో చిన్నవయినా వాసిలో ఉత్కృష్టమైనవై తులనాత్మక నాటక విమర్శకు లక్ష్యాలుగా చెప్పదగియున్నాయి. అందులో ఒకటి రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ గారి *నాటకోపన్యాసములు* (1935). రెండు ఉపన్యాసాల సంపుటి ఇది. ఇందులో మొదటి ఉపన్యాసం నాటక సమస్యల్ని గురించి. పాత్రోచిత భాష, గ్రామ్యభాష, పద్యనాటకాలు, గద్యనాటకాలు మొదలైన విషయాలమీద రాళ్లపల్లి వారి అభిప్రాయాలు. రెండవది ధర్మవరం–కోలాచలం వారి నాటక రచనా రీతుల్లో ఉన్న వైవిధ్యం. ఈ రెండవ వ్యాసంలో శర్మగారి తులనాత్మక వివేచన అపూర్వం. అలానే వేదం వెంకటరాయ శాస్త్రిగారు *భారతాభారత రూపకమర్యాదలు* (1941)లో ప్రాచ్యపాశ్చాత్య నాటక సిద్ధాంతాల సమానతలను, వైవిధ్యాన్ని సోదాహరణంగా చూపారు. ఇదేకోవకు చెందినది దువ్వూరి రామిరెడ్డిగారి నాటకకళా సంస్కరణము (1935).

అనౌచిత్య భూయిష్టమయిన నాటకరంగ విషయాలను ఖండించడంలో పానుగంటివారు సిద్ధహస్తులని చెప్పవచ్చును. సాక్షివ్యాసాలలో సారంగధర నాటక ప్రదర్శనము (1913), నాటక ప్రదర్శనము (1913), అన్న రెండు వ్యాసాలు నాటక రచనలోను, ప్రదర్శనలోను జరిగే అనౌచిత్య విషయాలను ఖండించారు. నాటక ప్రదర్శనములో పాటలు ఉండరాదని, పద్యాలను రాగాయుక్తంగా పాడరాదని, సంగీతాన్ని భక్తిరస సందర్భాలలో తప్ప మరొకప్పుడు ఉపయోగించకూడదని జంఘాల శాస్త్రి చేత చెప్పించారు పానుగంటి.

1943–1966

1943లో ఆంధ్రనాటక కళా పరిషత్తు, ప్రజానాట్యమండలుల ప్రారంభంలో తెలుగునాటకానికి కొత్తవేదికలు దొరికాయి. నాటక కళా పరిషత్తు 1929లోనే ప్రారంభమైన 1943లో దానికొక నూతన స్వరూపం వచ్చింది. పరిషత్తు వేదికలమీద వెలువడిన నటుల, నాటకకర్తల ఉపన్యాసాలు చాలభాగం పత్రికలలో వచ్చి నాటకాభిమానులను అలరించాయి. అందులో రాజమన్నారు, రాఘవ, పింగళి లక్ష్మీకాంతం, గోవిందరాజుల సుబ్బారావు, స్థానం నరసింహారావు, డి.వి. సుబ్బారావు ప్రభృతుల ఉపన్యాసాలు నాటక సమస్యల్ని కూలంకషంగా చర్చించి ప్రామాణికంగా నిలిచాయి. అలాగే ప్రజానాట్యమండలి కార్యక్రమాలు పల్లెపల్లెలకూ పాకి ఆ సంఘ సమాలోచనలు, దాని పర్యవసానాలు పత్రికలలో (ముఖ్యంగా ప్రజాశక్తిలో) రావడంతో సైద్ధాంతిక ప్రాతిపదికతో బయలుదేరిన తొలినాటకోద్యమం ప్రజానాట్యమండలి అయింది.

నాటకాలకు ఉత్తమమైన పీఠికలు వస్తూనే వున్నాయి. నాటికాసంపుటాలు రావడం యీ కాలం ప్రత్యేకత.

'ఏకాంకిక'లు సంపుటానికి శివశంకరశాస్త్రి, 'నేటి ఉత్తమ నాటికలు'కు శ్రీపాద గోపాలకృష్ణమూర్తి గార్ల పీఠికలు ఉన్నత ప్రమాణాలు కలిగియున్నాయి.

ఇదే కాలంలో శ్రీనివాస చక్రవర్తి నాటక విమర్శకుడుగా తమ రచనలు వెలువరించడం ప్రారంభించారు. ప్రాక్పశ్చిమ నాటక సిద్ధాంతాల అవగాహన, విద్యార్థులకు సామాన్యులకు కూడా తెలిసేటట్లు చెప్పగలిగిన తేలికభాష ఆయనలోని ముఖ్యమైన లక్షణాలు. నాట్యశాల (1946), నటన (1953) వీరి ప్రధమ గ్రంథాలు. నట (1953) బోల్కొలిస్కీ వ్రాసిన ............కు అనుసరణ. శ్రీనివాస చక్రవర్తిగారి అత్యుత్తమ విమర్శనా గ్రంథం 'అభినయం'. అభినయాన్ని గురించి ఇదివరకు పసుమర్తి యజ్ఞనారాయణ శాస్త్రిగారు, ఆ తరువాత చక్రవర్తిగారి గురువుగారు బి.టి. రాఘవాచార్యులుగారు ప్రాధమిక సూత్రాలద్వారా వివరించారు. కాని శ్రీనివాస చక్రవర్తి రష్యన్ నటుడు, దర్శకుడు అయిన స్టాన్‌స్లావిస్కీ ప్రఖ్యాత రచన .........ను *అభినయం* (1958) అన్న పేరుతో తెనిగించారు. ఈ ఆధికారిక లక్షణ గ్రంథాన్ని భారతదేశంలోనే మొదటిసారి అనువదించిన ఖ్యాతి శ్రీనివాస చక్రవర్తిగారిదే! ఆయన సంక్షిప్తంగా వ్రాసిన *ఆంధ్రనాటక చరిత్ర* (1963) కూడా ఇప్పుడు వచ్చిందే!

తల్లావఝుల కృత్తివాసతీర్థులు గారి *గీర్వాణ రూపకము* (1952) సంస్కృత నాటక చరిత్రను తెలుగు విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ప్రాంతీయ నాటకరంగాలను గురించి పుస్తకాలు రాసాగాయి. బండారు రామస్వామిగారు గుంటూరు నాటకరంగం గురించి *నటమిత్రుడు* (.....), కొమండూరు పార్థసారధి అయ్యంగార్ *నెల్లూరు నాటకకళ* (......) ఇటువంటి రచనల్లో ముఖ్యమైనవి.

బందరులో 1924వ సం॥ జూన్ 4 నుంచి 7 వరకు జరిగిన ఆంధ్రనట సభల్లో కాశీకృష్ణాచార్యులు గారి అధ్యక్షతన, చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రిగారి సమ్ముఖాన ఆంధ్రనాటకాల్లో పద్యపఠనం అవసరమా అన్న విషయాన్ని గురించి చర్చించారు భమిడిపాటి కామేశ్వరరావుగారు. ఈ రచననే పెంచి ఆంధ్రనాటక పద్య పఠనాన్ని (1957) ప్రచురించారు భమిడిపాటి వారు. తెలుగు నాటకరంగమీద నాటకానికి పద్య చేస్తున్న ద్రోహాన్ని నిర్మొహమాటంగా, సునిశితంగా విమర్శించారాయన. ఒక నాటకరంగ నటనావిధానం గురించి తెలుగులో ఇంత కూలంకషంగా చర్చించిన విమర్శగ్రంథం మరొకటి లేదు.

అదే సంవత్సరం ఆంధ్ర సారస్వత పరిషత్తు వారు *ఆంధ్రనాటకకర్తలు* (1957) మొదటి భాగాన్ని ప్రచురించారు.

1955లో శ్రీనివాస చక్రవర్తిగారు నేతృత్వంలో *నాట్యకళ* ప్రారంభమై తెలుగు నాటకాన్ని, నాటక రంగాన్ని విభిన్నమైన కోణాల ద్వారా పరిశీలించి తమ పరిశోధనలను వెలువరించగల మాధ్యమం అయింది.

ఇంతపూర్వ వున్న భారతి, ఆంధ్రపత్రికలతో పాటు కిన్నెర, నవభారతి వంటి పత్రికలు కూడా నాటక విమర్శకు దోహదం చేశాయి. 1955లో ఆంధ్ర పత్రికలో చెలరేగిన సాహిత్య దుమారం "కన్యాశుల్కం గురజాడ

రచనేనా?" గురజాడకు ఇనుమడించిన గుర్తింపును తెచ్చిపెట్టింది. కిన్నెరలో భూపతి లక్ష్మీనారాయణరావుగారి, వ్యాసాలు, ఆంధ్రపత్రికలో వి.ఆర్. జగపతి రాయవర్మగారి వ్యాసాలు నాటకాన్ని గురించిన సక్రమమైన అవగాహనను కలిగించేవిగా ఉన్నాయి. 1955–56, 56–57 సంవత్సరాలలో తిరుమలరాయచంద్రగారి సంపాదకత్వంలో ప్రచురింపబడిన *పరిశోధన* ధర్మవరం, గురజాడ ప్రత్యేక సంచికలు యీ నాటికీ ఆధికారికమైనవే!

నాట్యశాస్త్రానువాదాలు కూడా ఈ కాలంలోనే ప్రారంభమయ్యాయి. నాట్యశాస్త్రంలోని మొదటి అయిదు అధ్యాయాలను ఆంధ్రభారతీ వ్యాఖ్య సహితంగా పోతుకుచ్చి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు 1951లో ప్రచురించారు. తెలుగులో నాట్య శాస్త్రాల వాదానికి ఇది తొలి ప్రయత్నం. జమ్మలమడక మాధవరాయశర్మగారు 1–7, 18–21 నాట్య శాస్త్ర అధ్యాయాలను అభినవ భారతీ సహితంగా 1956–58లలో వెలువరించారు. భారతదేశంలోనే – సమగ్రమైన వ్యాఖ్యానంతో వెలువడిన నాట్యశాస్త్రాన్ని తెనిగించిన డాక్టర్ పి.యస్.ఆర్. అప్పారావుగారి గ్రంథం 1959లో ప్రచురితం అయింది. సాహిత్య గ్రంథాలలో నాట్యశాస్త్రం కాక కొమండూరు అనంతాచార్యులుగారి *దశరూపక సంగ్రహము* (1912), మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి *దశరూపకము* (1916), పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారి *కావ్యమీమాంస* (1930), శే.వెం.రాఘవ అయ్యంగారి *కావ్యాత్మ* (1934), ధరణికోట వెంటక సుబ్బయ్యగారి *రసగంగాధరము* (1963) ముఖ్యమైనవి.

ఆంధ్రనాటక కళా పరిషత్తు రజతోత్సవ సంచిక (1960), చిలకమర్తి (1944), కొండా వెంకటప్పయ్య పంతులు (1953), ప్రకాశం పంతులు (1955) ఆత్మచరిత్రలు నాటక రంగంమీద వారి అనుభవాలనేకాక సమకాలీన నాటక రంగాన్ని గురించి కూడా విస్తృతంగా చర్చించాయి.

నాటకరంగానికి నేరుగా సంబంధించకపోయినా, తత్సంబంధమైన విషయాలమీద పరిశోధన ప్రారంభమవుతున్న ఆ తొలిరోజుల్లో కొత్తపల్లి వీరభద్రరావుగారి తెలుగు సాహిత్యముపై ఇంగ్లీషు ప్రభావము (1960), యస్.వి. జోగారావుగారి ఆంధ్రయక్షగాన చరిత్ర (1961) ముఖ్యమైనవి.

1967–1999

సమకాలీన సాహిత్య రంగంలో విమర్శచాలాభాగం విశ్వవిద్యాలయాల్లో జరిగిన పరిశోధనా ఫలితమని చెప్పవచ్చు. ఒక రచయితనో, ఒక కాలన్నో నిర్ణయించుకుని దానిమీద పరిశోధన చేయడానికి తగిన సదుపాయాలు, తదనంతరం ముద్రణ సదుపాయాలు విశ్వవిద్యాలయాల అధ్యాపకులకు ఉన్నంత మిగిలిన వారికి లేదు. తెలుగు నాటక సాహిత్యం మీద, నాటక రంగం మీద వచ్చిన పరిశోధన గ్రంథాలు తక్కువే. ఒక రచయిత సమగ్ర జీవిత, సాహిత్య పరిశీలన ఇందులో చాలా పరిశోధనలకు వస్తువు కావడంతో సాహిత్య విమర్శలో నాటక విమర్శ ఒక భాగమైపోయింది. దీనివల్ల రచయిత సంపూర్ణ ఆవిష్కారం జరుగుతున్నదన్నది నిజమే. కాని ఎన్నో సాహిత్యరంగాలలో ప్రతిభావంతులయిన రచయితలను గురించిన పరిశోధన చేస్తున్నప్పుడు నాటక విమర్శ సంక్షిప్తం అయిపోతూ వచ్చింది. ఈ నియమితమైన పరిధిలోనే కొన్ని చెప్పుకోదగ్గ పరిశోధన గ్రంథాలు వచ్చాయి.

ఇందులో మొదటిది, 1929వరకు దాదాపు సమగ్రమైందీ డాక్టర్ పి.యస్.ఆర్. అప్పారావుగారి *తెలుగు నాటక వికాసం* (1967). ఇందులో నాటక రచయితల కృషిని ఆనుపూర్వికంగా ఇవ్వడమే కాక నాటక సాహిత్యాన్ని వస్తుపరంగా విభజించి పరిశీలించడం జరిగింది. నటులను గురించి, నాటక సమాజాలను గురించి కూడా అప్పారావుగారు సంక్షిప్తంగా వ్రాయడం జరిగింది. నాట్యశాస్త్రంలో నాటక లక్షణాలను, తెలుగు నాటక వికాసంలో లక్ష్యాలను, ఇటీవల వచ్చిన శారీరాభినయం, సాత్త్వికాభినయం, ప్రథమాంధ్ర నాటకకర్తలలో లక్ష్యలక్షణాలను కూడా జోడించి ఆంధ్రలోకానికి యిచ్చిన ఘనత అప్పారావుగారిది.

అప్పారావుగారి పరిశోధన తరువాత దురదృష్టం కొద్దీ (నాటకరంగానికి) పరిశోధన రచయితల మీదకు మళ్ళింది. ఇందులో కూడా పేర్కొనదగిన పరిశోధన గ్రంథాలు వెలువడ్డాయి. డా॥ యం. వీరభద్రశాస్త్రిగారి "పానుగంటి సాహిత్య సృష్టి" (1968) సంక్షిప్తంగా వున్నా పానుగంటి బహుముఖ ప్రజ్ఞను మనోజ్ఞంగా చాటిన గ్రంథం. డా॥ అక్కిరాజు రమాపతిరావుగారి వీరేశలింగం పంతులు: సమగ్ర పరిశీలన (1972) నిజమైన సమగ్ర పరిశీలన. డా॥ యస్. గంగప్పగారి "కోలాచలం శ్రీనివాసరావు" (1977), డా॥ సాధన వీరాస్వామి నాయుడుగారి "నాటకాలోకము" (1984) ఆ రచయితల మనస్తత్వానికి చక్కని వ్యాఖ్యలు. ఇవికాక డా॥ ముక్తేవి భారతి "చిలకమర్తి" (1988) మీద, డా॥ కొట్ర వెంకటాచార్యులు "కాళ్లకూరి" మీద (1989), డా॥ ఆర్. కమల విశ్వనాధ పేరుమీద (1991), డా॥ తక్కెళ్ల బాలరాజు బోయిభీమన్న మీద (1996) వ్రాసిన పరిశోధన వ్యాసాలు పేర్కొనదగినవి. నరాల వీరయ్య "తొలిమలి కన్యాశుల్కాల తులనాత్మక అధ్యయనం" (1985) తులనాత్మక విమర్శగా విశిష్టమైనది.

ప్రక్రియా పరంగా వచ్చిన పరిశోధన గ్రంథాలలో పి.వి. రమణ: తెలుగు సాంఘిక నాటకం (1988), పాశ్చాత్య సాంఘిక నాటక ప్రభావం (1933); తోటకూర ప్రభాకరరావు: తెలుగు పౌరాణిక నాటకాలు – హేతువాద దృక్పథం (1989); వనం మధుసూదన్: తెలుగు ఏకాంకికా వికాసం (1990); యం. రజని: తెలుగులో బాలనాటికలు (1990); జయప్రభ: నాలుగోగోడ (1994); కందిమళ్ల సాంబశివరావు: తెలుగు నాటక రంగం – నూతన ధోరణులు, ప్రయోగాలు (1995) పేర్కొనదగినవి.

విశ్వవిద్యాలయాలకు చెంది, తమ పి.హెచ్.డి పరిశోదనాంశం కాకుండా నాటకాల మీద విమర్శ చేసిన వ్యక్తులు తక్కువ. ఆచార్య శిష్టా రామకృష్ణ శాస్త్రిగారి నాటకవిమర్శ (1963); ఆంధ్ర నాటక కళ (1969) చాలా ముఖ్యమైన రచనలు. ఆచార్యన జి.వి. సుబ్రహ్మణ్యంగారి తిరుపతి వెంకటకవుల సాహిత్య సృష్టి (....)లో ఆ కవుల నాటకమర్మాన్ని ఉదాత్తంగా ప్రజ్వలింపచేశారు. కేతవరపు రామకోటిశాస్త్రిగారి నూరేళ్ల కన్యాశుల్కం (1994), నాటక విశ్లేషణ (1993) ఆయనకు నాటకం మీద ఉన్న పరిపుష్టమైన అవగాహనకు నిదర్శనాలు.

విశ్వవిద్యాలయ పరిధికిరాని విమర్శన గ్రంథాల రాశిలోను, వాసిలోను కూడా విశిష్టమైనవి. మిక్కిలినేని

రాధాకృష్ణమూర్తిగారు విశ్రాంతి ఎరుగని నాటక శ్రామికుడు. ఆయన వ్రాసిన ఆంధ్ర నాటక రంగ చరిత్రకు 1955లోనే తెలుగు భాషా బహుమతి వచ్చినా 1969లోకాని ప్రచురితం కాలేదు. జానపద నాటకాల నుంచి, ఆధునిక నాటకాల దాకా – నటుల, సమాజాల, నాటక రచయితలను గురించిన బృహద్గ్రంథం అది. అలానే ఆయన నటరత్నాలు (మొదటి భాగం, 1980) దాదాపు 256 మంది నటుల జీవిత విశేషాలను తెలుగు నాటకరంగానికి వారు చేసిన సేవను చిరస్థాయిగా మనం స్మరించుకునేటందుకు వీలుగా గ్రంథస్తం చేశాడు. ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడెమీ చేసిన సేవను ఇప్పుడు జ్ఞాపకం చేసుకోవడం అవసరం. నాట్యకళను పదేళ్ళపాటు నడపవడమే కాక ఆంధ్రదేశంలోని నటీనటుల, సమాజాల జాబితాను తయారుచేసింది. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో ధర్మవరం, కోలాచలం, తిరుపతి వేంకటకవులు, చిలకమర్తి నాటకాలమీద మోనోగ్రాఫ్‌లు ప్రచురించింది. ఈ కోవకు చెందినదే పాతూరి శ్రీరామశాస్త్రిగారి ................ అలాగే 1980 ఆంధ్రనాటకరంగ శతజయంతి సందర్భంలో నాట్యకళ ప్రత్యేక సంచికను, నూరేళ్ళ తెలుగు నాటక రంగం (సం॥ మొదలి నాగభూషణ శర్మ) అన్న సంపుటిని ప్రకటించింది.

మిక్కిలినేని తరువాత తెలుగు నాటక విమర్శను సుసంపన్నం చేసినవాడు శ్రీనివాస చక్రవర్తి. ఈ సమకాలీన యుగంలోకూడా ఆయన ఆంధ్రనాటక చరిత్ర (1963), యవనిక (1970), ప్రాచీన పాశ్చాత్య నాటకరంగ చరిత్ర (1969) వంటి విశ్లేషణాత్మకమైన గ్రంథాలను వ్రాశాడు. విద్యార్థులకు పాఠ్యగ్రంథంగా ఉండే విధంగా రంగస్థల శాస్త్రమును రెండు భాగాలుగా ప్రకటించింది తెలుగు అకాడెమీ. ఇవ్వాల్టికీ ఈ పాఠ్యగ్రంథాల ప్రశస్తి తగ్గలేదు – బహుశః వీని స్థానంలో ఇతర గ్రంథాలు రాలేదు కనుక. తెలుగు నాటక రంగానికి ఎనలేని సేవచేసిన శ్రీ కె.వి. గోపాలస్వామి, శ్రీ ఎ.ఆర్. కృష్ణల సంపాదకత్వాన వెలువడిన యీ గ్రంథాలు రెండో ముద్రణకు కూడా వచ్చాయి. తెలుగు విశ్వవిద్యాలయానికి కొందరు నిష్ణాతులు ఇటువంటివి, ఇంతకన్నా విస్తృతమైనవి – గ్రంథాలు వ్రాసి యిచ్చారు. అవి ఏమయ్యాయో తెలియదు.

ఆధునిక తెలుగు నాటకరంగాన్ని గురించిన వచ్చిన పుస్తకాలలో గండవరపు సుబ్బరామిరెడ్డి గారి ఆధునిక తెలుగు నాటకం రెండు సంపుటాలలో ఎంతో కృషి ద్యోతకం అవుతుంది. ఆయన విస్తృతమైన నాటక పఠనం, నిజాయితీ, ఇందులో వ్యక్తం అవుతున్నాయి.

1924 నుంచి 1965 వరకు అవిశ్రాంతంగా నాటకరంగ పురోభివృద్ధికి పాటుపడిన అబ్బూరి రామకృష్ణయ్యగారి వ్యాసాలన్నీ నాట్యగోష్టిలో సంకలనం చేశారు. ఇవ్వాల్టి నాటకరంగంలో ఆయన ప్రతిభ అనితర సాధ్యమైనది. కన్యాశుల్కం, ప్రతాపరుద్రీయాలకు ఆయన తయారు చేసిన .........(నటన ప్రతులను) ఆయనే వ్రాసుకున్న ...........తో ముద్రించవలసిన అవసరం ఎంతో వుంది.

కాలంలో వచ్చిన కొన్ని ముఖ్యమైన సంకలనాలను కూడా ఇక్కడ పేర్కొనవలసివుంది. గొల్లపూడి మారుతీరావుగారి సంపాదకత్వాన వచ్చిన కళావని (1965), నాగభూషణ శర్మ సంపాదకత్వాన వచ్చిన నూరేళ్ళ తెలుగు నాటకరంగం (1980), గురజాడ శతవార్షిక జయంతి సంచికలు, ఢిల్లీవారి గురజాడ సంస్మరణ

సంచిక, నటరాజ కళాసమితి శ్రీకాకుళం వారి కన్యాశుల్కం రజతోత్సవ ప్రత్యేక సంచిక (1980), వరంగల్లు ఎ.వి. కళాశాల వారి 'నాటక రచన ప్రయోగం' (1984) పుస్తకం పేర్కొనదగినవి. ఇవికాక బళ్ళారి రాఘవ, సురభి నాటక సంస్థల మీద, వనారస గోవిందరావుగారి సప్తతి మహోత్సవ సంచిక, రజితోత్సవ సంచికలు, ప్రజానాట్యమండలి ప్రత్యేక సంచికలు ఎంతో విలువైన సమాచారాన్ని అందిస్తున్నాయి.

నాటక రచయితల మీద జరిగిన పరిశోధనలో అగ్రతాంబూలం గురజాడ అప్పారావుది. అవసరాల సూర్యారావుగారు అయిదు సంపుటాలుగా ప్రకటించిన ఆయన రచనలు సెట్టి ఈశ్వరరావుగారి 'మహాకవి – మహా పురుషుడు' (1943), కె.వి. రమణారెడ్డిగారి గురజాడ వెలుగుజాడ (1955), మహోదయం (1969), ఆరుద్ర 'గురజాడ గురుపీఠం' (1980), శ్రీశ్రీ 'గురజాడ' (1959), సర్దేశాయి తిరుమలరావుగారి 'కన్యాశుల్క నాటక కళ' (1969) ముఖ్యమైనవి. 1993 కన్యాశుల్క శతజయంతి సంచిక విజయనగరం నుంచి వెలువడ్డది, ఎందరో ప్రముఖుల వ్యాసాలతో.

అలాగే కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారి మీద కూడా కొన్ని సంకలనాలు, ప్రత్యేక సంచికలు, విమర్శ గ్రంథాలు వచ్చాయి. అందులో త్రిపురనేని సుబ్బారావుగారి కవిరాజు జీవితం, వివిధ రచయితల కవిరాజు దర్శనం (1964) ముఖ్యమైనవి. విశ్వనాథ మీద వచ్చిన పరిశోదన గ్రంథాలు కాక, విశ్వనాథ శారద సంచికలు ఆయన బహుముఖ ప్రజ్ఞకు అద్దం పడుతున్నాయి. ఉస్మానియా విశ్వవిద్యాలయం పక్షాన ఆత్రేయ నాటకోత్సవాల సందర్భంలో వెలువడ్డ "ఆత్రేయ – తెలుగు నాటకరంగం" (1985) ప్రఖ్యాత నాటక రచయితలకు నాటకలోకం పట్టిన నివాళి. "నాట్యకళ" పత్రిక నటీనటుల, రచయితలమీద చాలా ప్రత్యేక సంచికలు తెచ్చింది. అందులో తిరుపతి వేంకటకవులు, చిలకమర్తి, హరిప్రసాదరావు, స్థానం, బళ్ళారి రాఘవలపై వచ్చిన ప్రత్యేక సంచికలు ఎన్నదగినవి.

నాటకరంగానికి సంబంధించిన సాంకేతిక గ్రంథాలు కూడా కొన్నివచ్చాయి. రంగస్థల శాస్త్రం తరువాత కప్పగంతుల మల్లిఖార్జునరావుగారి నాటక సమీక్ష (1979), వ్యాసమాలిక (1988) సమకాలీన నాటక రంగానికి ముఖ్యమైన సమస్యలను చర్చించిన ఉత్తమ గ్రంథాలు. ఎన్. వెంకటేశ్వరరావు నటనాశిల్పం (1960), పాలెపు రఘుపతి నటుడు–శిల్పం (1966), రోహిణి "నాటకశిల్పం" (1960), రామన్న పంతులు "నాటక ప్రయోగం" (1972), కొర్రపాటి గంగాధరరావు "నటన–దర్శకత్వం" (1977) ఎన్నదగినవి. కొర్రపాటి పుస్తక ముందుగా ..........ద్వారా ఎందరో విద్యార్థులకు నాటకరంగ అవగాహనను కలగచేశాయి. ఎందరో ప్రఖ్యాతులైన నటుల మీద పుస్తకాలు, ప్రత్యేక సంచికలు వచ్చాయి. బిందాన నారాయణరావుగారి మనశ్రీరంగం, మల్లాది వెంకట కృష్ణ శర్మగారి సురభి అవేటి నాగేశ్వరరావుల మీద పుస్తకాలు, కొత్తదేశపతిరావుగారి "బళ్ళారి రాఘవ" (1970) ప్రశస్తమైన పుస్తకాలు. డి.వి. సుబ్బారావు, పీసపాటి నరసింహమూర్తి, మల్లాది సూర్యనారాయణ, పి. సూరిబాబు, ఎ.ఆర్. కృష్ణ, గణపతిరాజు అచ్చుతరామరాజు, కొర్రపాటి గంగాధరరావు, చాట్ల శ్రీరాములు, ఎ.ఆర్. నంది, పొన్నాల రామసుబ్బారెడ్డిగార్ల మీద వచ్చిన ప్రత్యేక సంచికలు ఆయా రచయితల, దర్శకుల, నటుల ప్రతిభా వైశిష్ట్యాన్ని చాటుతున్నాయి.

చెప్పుకోదగిన నాటక విమర్శనా సాహిత్యం ఆంగ్లంలో రాలేదుగాని, వచ్చినంతలో కోలాచలం శ్రీనివాసరావు గారి ................. (1908) ప్రప్రథమ గ్రంథం. తెలుగు వాళ్లు ఆంగ్లనాటకాలు వ్రాశారని, ఇంగ్లీషు నాటకాలకు వ్యాఖ్యానాలు వ్రాశారని ఇవాళ మనలో చాలామందికి తెలియదు. గురజాడ, సి.ఆర్. రెడ్డి, బళ్ళారి రాఘవల వ్యాసాలు తెలుగు నాటక రంగాన్ని తమ విమర్శలతో సుసంపన్నం చేశాయి. సోమంచి యజ్ఞన్న శాస్త్రి, బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం ప్రభృతులు అనేక నాటక విషయాలమై వ్యాసాలు వ్రాశారు. నేను వ్రాసిన బళ్లారి రాఘవ, ఆచార్య ఆత్రేయల మీద ఆంగ్ల గ్రంథాలు వలన నాటక రంగాన్ని ఆంధ్రేతర పాఠకులకు అందించాలన్న తపనకు ఫలితం. గండవరపు సుబ్బిరామిరెడ్డి, జి.యస్. ప్రసాదరెడ్డి, డి.యస్.యన్. మూర్తి ఆధునికి నాటకరంగంమీద పరిశోధన వ్యాసాలు, గ్రంథాలు ప్రకటించారు. పాతూరి శ్రీరామ శాస్త్రిగారి ......... ఈనాటికీ ఆ 110 సంవత్సరాల వృత్తి నాటక సంస్థ మీద ఉన్న ఏకైక గ్రంథం. సాహిత్య అకాడెమీ ప్రచురణల్లో నార్ల వ్రాసిన కందుకూరి, గురజాడ మీదద మోనోగ్రాఫులు, వేదం వారి మీద వేదం (జూ॥), తిరుపతి వెంకటకవుల మీద దివాకర్ల వెంకటావధానిగారు, పానుగంటి వారిమీద యం.వి. శాస్త్రి గార్లు మోనోగ్రాఫ్‌లు వ్రాశారు.

పాశ్చాత్య సాహిత్య దర్శనంలో జి.వి. కృష్ణారావుగారి జేగంటలు (1949), భారతీయ సాహిత్య శాస్త్రాలలో చర్ల గణపతి శాస్త్రిగారి సాహిత్య సౌందర్య దర్శనం (1972) ప్రత్యేకంగా పేర్కొనదగినవి. గ్రీకు రూపకాలను గురించి యం.ఆర్. అప్పారావుగారు, సంస్కృత నాటక రంగ ప్రయోగం గురించి ఓగేటి అచ్చుతరామ శాస్త్రి గారు రెండు ప్రాచీన సంస్కృతుల్లో నాటక రంగ ప్రాముఖ్యతని గురించి తెలియచెప్పారు. సంస్కృత నాటక వివేచనలో విశ్వనాథ వారి కాళిదాసుని అభిజ్ఞానత కాళిదాసుని ప్రతిభకు నీరాజనం పడుతూనే విశ్వనాథవారి వివేచనా గరిమను వెల్లడిస్తున్నది. మేడేపల్లి వెంకట రమణాచార్యులుగారి అలంకార శాస్త్ర చరిత్రము (1932), పింగళి లక్ష్మీకాంతం గారి సాహిత్య శిల్ప సమీక్ష (1977)లో నాటక భాగము ముఖ్యమైన అలంకార శాస్త్ర విమర్శక గ్రంథాలు.

ఇంకా ఎందరో తమ జీవితకాలాన్ని నాటక విమర్శకూ, నాటకరంగ సమీక్షకూ వినియోగించారు. వారందరికీ నమస్కారాలు.